TGTEL/25/A4812

# వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 60 | పేజీలు : 04| వెల: రూ.3/-   తెలంగాణ   గురువారం | జూన్ 11, 2026

## కవిత 'టీఆర్ఎస్' పార్టీకి ఈసీ సెగ


- పేరు కేటాయింపుపై వెల్లువెత్తిన అభ్యంతరాలు..
- ఉత్కంఠగా మారిన గుర్తింపు
- బీఆర్ఎస్‌తో పాటు సోలాపూర్ సంస్థ నుండి ఫిర్యాదులు..
- కేంద్ర ఎన్నికల సంఘానికి 700 పైగా దరఖాస్తులు



2లో..

## 'ఫ్యూచర్ సిటీ'ని వంద శాతం రద్దు చేస్తాం

- మాజీ మంత్రి హరీష్ రావు
- ఫార్మా భూములను రియల్ ఎస్టేట్ కోసం వాడితే ఊరుకోం..
- చట్టం అంగీకరించదు
- మీనాక్షి నటరాజన్‌కు తెలంగాణ కాంగ్రెస్ వెన్నుపోటు..
- సీఎం సొంతింటికి రూ.100 కోట్ల ప్రజాధనమా?




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 'ఫ్యూచర్ సిటీ'ని భవిష్యత్తులో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే వందకు వంద శాతం రద్దు చేస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీష్ రావు సంచలన ప్రకటన చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తుగ్లక్ నిర్ణయాల వల్ల రాష్ట్రం నుండి రూ. 70 వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు తరలిపోయాయని ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై ముప్పేట దాడి చేస్తూ ఘాటు విమర్శలు గుప్పించారు. ఫార్మా సిటీని రద్దు చేసి రైతులకు భూములు వెనక్కి ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్.. ఇప్పుడు అదే భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడాలని చూస్తోందని హరీష్ రావు ఆరోపించారు. "ఫార్మా సిటీ కోసం నేను కూడా నా స్వంత భూమి 17 ఎకరాలు ఇచ్చాను. ఫార్మా కోసం సేకరించిన భూములను ఇతర అవసరాలకు మారిస్తే చట్టం అంగీకరించదు, దీనిపై ఇప్పటికే రైతులు కోర్టులను ఆశ్రయించారు" అని గుర్తు చేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకించడం లేదని, కానీ వివాదాలు లేని పాత భూములను లేదా ప్రత్యామ్నాయ స్థలాలను వారికి వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మధ్యప్రదేశ్ నుంచి దాఖలు చేసిన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడం వెనుక తెలంగాణ కాంగ్రెస్ నేతల వెన్నుపోటు హస్తం ఉందని హరీష్ రావు బాంబు పేల్చారు. "ఆమెపై తెలంగాణలో కేసు ఉన్నట్లు తమకు సమాచారం అందిందని మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రే స్వయంగా స్పష్టం చేశారు. మరి ఈ అంతర్గత సమాచారాన్ని బీజేపీకి లీక్ చేసింది ఎవరు?" అని ప్రశ్నించారు. ( మిగతా వివరాలు 2వ పేజీలో..)

## 'సర్' ప్రక్రియపై ఎందుకంత భయం?

- దొంగ ఓట్లను తొలగిస్తే విపక్షాలు ఎందుకు వణుకుతున్నాయి?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు




**సిద్దిపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై బురదజల్లడమే పనిగా ప్రతిపక్షాలు పెట్టుకున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. దొంగ ఓట్లను ఏరివేయడం ఎన్నికల సంఘం కనీస విధి అని, దీనికి ప్రతిపక్షాలు ఎందుకు భయపడుతున్నాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కూకునూరుపల్లి మండలం మాత్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో ఎస్ఐఆర్ నిర్వహించినప్పుడు బీజేపీ పూర్తి స్థాయిలో మద్దతిచ్చిందని, కానీ ఇప్పుడు కేవలం తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు బీజేపీపై తప్పుడు ప్రచారం చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని రామచందర్‌రావు మండిపడ్డారు. ( మిగతా వివరాలు 2వ పేజీలో..)

## ఏకాంతంగా ఉన్న ప్రేమజంటలే లక్ష్యం..

- ముగ్గురు దోపిడీ దొంగల అరెస్ట్
- ఫొటోలు తీసి, తల్లిదండ్రులకు చెబుతామని బెదిరింపులు..
- ఉర్సుగుట్ట వద్ద దారుణం
- బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం.



**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నగర పరిధిలో ఏకాంతంగా గడుపుతున్న ప్రేమికులను లక్ష్యంగా చేసుకుని, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతూ సొమ్ము దోచుకుంటున్న ముగ్గురు కేటుగాళ్లను పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. కాజీపేటకు చెందిన బౌరి పవన్ సింగ్, రవీందర్ సింగ్, సికిందర్ సింగ్ అనే ముగ్గురు యువకులు ముఠాగా ఏర్పడి ఈ దందా సాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 7న ఉర్సు గుట్ట పరిసర ప్రాంతంలో ఒక యువతీ యువకుడు బైక్‌పై వెళ్లడాన్ని ఈ ముఠా గమనించింది. వారు నిర్మానుష్య ప్రాంతంలో ఏకాంతంగా గడుపుతుండగా, నిందితులు తమ సెల్‌ఫోన్లలో వారిని రహస్యంగా ఫొటోలు తీశారు. ( మిగతా వివరాలు 2వ పేజీలో..)

## ప్రత్యేక ప్రణాళికతో గోదావరి పుష్కరాలు



- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- కోట్లాది మంది భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు..
- తీర ప్రాంతాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- ఆర్టీసీ ఎండీతో కలిసి హుస్నాబాద్ బస్టాండ్ క్షేత్రస్థాయి పరిశీలన..
- పెద్ద షాపింగ్ మాల్‌గా మార్పు

2లో..

వాయిస్ ఆఫ్ వందే భారత్ Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
గురువారం, జూన్ 11, 2026

## 'ఫ్యూచర్ సిటీ'ని వంద శాతం రద్దు చేస్తాం

**మాజీ మంత్రి హరీష్ రావు**

**ఫార్మా భూములను రియల్ ఎస్టేట్ కోసం వాడితే ఊరుకోం..**

**చట్టం అంగీకరించదు**

**మీనాక్షి నటరాజన్‌కు తెలంగాణ కాంగ్రెస్ వెన్నుపోటు..**

**సీఎం సొంతింటికి రూ.100 కోట్ల ప్రజాధనమా?**



(**మొదటి పేజీ తర్వాత..**) సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన వ్యక్తికి కాంగ్రెస్ అధిష్టానం వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇవ్వనందుకే, రేవంత్ ముఖ్య అనుచరుడైన సదరు నేత ఈ సమాచారాన్ని లీక్ చేశారని ఆరోపించారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే ప్రత్యేక దర్యాప్తు సంస్థ లేదా జ్యుడీషియల్ ఎంక్వైరీ వేయాలని బహిరంగ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాధనాన్ని నిలువునా వృధా చేస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. రూ. 100 కోట్ల ఖర్చుతో తన నివాసం సమీపంలో 'బోధి పెవిలియన్' పేరుతో సీఎం అత్యంత విలాసవంతమైన భవనాన్ని నిర్మిస్తున్నారని ఆరోపించారు. కేవలం ఇనుప కంచెలకే రూ.17 కోట్లు, రక్షణ, ఫుట్‌బాల్ ఆడుకోవడానికి రూ.10 కోట్లు కేటాయించారని ఎద్దేవా చేశారు. దీనికోసం రూ.7 కోట్లతో జీవో ఇచ్చి ఇప్పటికే రూ.70 కోట్లకు పైగా ఖర్చు చేశారన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడానికి నిధులు లేవని సాకులు చెప్పే ప్రభుత్వం.. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయాలకు, సోకులకు వందల కోట్లు ఎలా ఖర్చు పెడుతుందని హరీష్ రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

## ప్రత్యేక ప్రణాళికతో గోదావరి పుష్కరాలు

- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- కోట్లాది మంది భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు..
- తీర ప్రాంతాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- ఆర్టీసీ ఎండీతో కలిసి హుస్నాబాద్ బస్టాండ్ క్షేత్రస్థాయి పరిశీలన..
- పెద్ద షాపింగ్ మాల్‌గా మార్పు



**సిద్దిపేట/హుస్నాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** రాబోయే 2027 ప్రతిష్టాత్మక గోదావరి మహా పుష్కరాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. పుష్కరాల దృష్ట్యా ఇప్పటికే గోదావరి తీర ప్రాంతాల సమగ్ర



అభివృద్ధికి ప్రత్యేక 'మాస్టర్ ప్లాన్' సిద్ధం చేశామని, కోట్లాదిగా తరలివచ్చే భక్తుల రవాణా సౌకర్యార్థం టీజీఆర్టీసీ ఆధ్వర్యంలో భారీగా ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆయన ప్రకటించారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణ బస్టాండ్‌ను ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డితో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులతో మంత్రి నేరుగా మాట్లాడి బస్సుల లభ్యత, సమయపాలన మరియు బస్టాండ్‌లోని మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రయాణికుల సంఖ్య పరంగా, ఆర్టీసీ ఆదాయం పరంగా హుస్నాబాద్ డిపో ఎంతో ముందంజలో ఉందని మంత్రి అభినందించారు. ఇక్కడి నుంచి ప్రతిరోజూ సుమారు 35 వేల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారని తెలిపారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా హుస్నాబాద్ బస్టాండ్‌ను అన్ని రకాల అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కూడిన ఒక పెద్ద 'షాపింగ్ మాల్' తరహాలో సరికొత్తగా అభివృద్ధి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. నాలుగు ప్రధాన జిల్లా కేంద్రాలను అనుసంధానిస్తూ ఫోర్‌లైన్ రహదారులు కలిగిన హుస్నాబాద్ ప్రాంతాన్ని ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి వివరించారు. రాబోయే రోజుల్లో పట్టణంలో అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు.. ఇంజినీరింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీ, పర్యాటక రంగం, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు ద్వారా హుస్నాబాద్ రూపురేఖలు మార్చబోతున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు, స్థానిక మున్సిపల్ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## కవిత 'టీఆర్ఎస్' పార్టీకి ఈసీ సెగ

- పేరు కేటాయింపుపై వెల్లువెత్తిన అభ్యంతరాలు..
- ఉత్కంఠగా మారిన గుర్తింపు
- బీఆర్ఎస్‌తో పాటు సోలాపూర్ సంస్థ నుండి ఫిర్యాదులు..
- కేంద్ర ఎన్నికల సంఘానికి 700 పైగా దరఖాస్తులు

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఎమ్మెల్సీ కవిత ప్రతిపాదించిన కొత్త రాజకీయ పార్టీ పేరు చుట్టూ జాతీయ స్థాయిలో ఆసక్తికర పరిణామాలు, ఊహించని చట్టపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఆమె ప్రకటించిన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీ రిజిస్ట్రేషన్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి భారీగా అభ్యంతరాలు రావడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కవిత తన పార్టీ పేరును అధికారికంగా ప్రకటించడానికి ఒక్క రోజు ముందే, మహారాష్ట్రలోని సోలాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన' అనే సంస్థ 'టిఆర్ఎస్' పేరును తమకే కేటాయించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. ఆ సంస్థ ప్రతినిధి దయానంద్ మహాదేవ్ మామ్‌డ్యాల్ ఈ మేరకు ఈసీఐకి ముందస్తుగానే దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. మరోవైపు ఈ పేరుపై భారత్ రాష్ట్ర సమితి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 14 ఏళ్ల సుదీర్ఘ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో 'టీఆర్ఎస్' (తెలంగాణ రాష్ట్ర సమితి) అనే పేరు ఇక్కడి ప్రజల భావోద్వేగాలతో, చరిత్రతో ముడిపడి ఉందని బీఆర్ఎస్ పేర్కొంది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మెజారిటీ ప్రజలు బీఆర్ఎస్‌ను 'టిఆర్ఎస్'గానే గుర్తిస్తున్నారని, కాబట్టి ఆ పేరును లేదా దానికి దగ్గరగా ఉన్న పేర్లను ఇతరులకు కేటాయించవద్దని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి అధికారికంగా లిఖితపూర్వక ఫిర్యాదు చేసింది. కవిత తన కొత్త పార్టీ పేరుపై పత్రికల్లో ఇచ్చిన బహిరంగ ప్రకటనపై కూడా పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. 'టిఆర్ఎస్' పేరును ఆమెకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ దాదాపు 600 నుండి 700 వరకు ప్రజా అభ్యంతరాలు కేంద్ర ఎన్నికల సంఘానికి అందినట్లు తెలుస్తోంది. వీటికి తోడు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద 'తెలంగాణ రాజ్య సమితి' పేరుతో నమోదైన మరో రాజకీయ పార్టీ కూడా ఈ పేరు వాడకాన్ని వ్యతిరేకిస్తూ ఈసీని ఆశ్రయించింది. కాగా, ఈ వ్యవహారంపై లీగల్‌గా ముందుకు వెళ్లాలని కవిత భావిస్తున్నట్లు సమాచారం. తమపై వస్తున్న అభ్యంతరాలకు సరైన వివరణ ఇచ్చేందుకు కవిత ప్రతినిధుల బృందం త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను కలవడానికి సిద్ధమవుతోంది. ముప్పేట వస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో కవిత కొత్త పార్టీకి 'టీఆర్ఎస్' అక్షరాల గుర్తింపు దక్కుతుందా? లేదా? అనేది ప్రస్తుతానికి రాజకీయ వర్గాల్లో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది.

## ఏకాంతంగా ఉన్న ప్రేమజంటలే లక్ష్యం..

- ముగ్గురు దోపిడీ దొంగల అరెస్ట్
- ఫొటోలు తీసి, తల్లిదండ్రులకు చెబుతామని బెదిరింపులు..
- ఉర్సుగుట్ట వద్ద దారుణం
- బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం..

(**మొదటి పేజీ తర్వాత..**) అనంతరం ఆ జంట వద్దకు వెళ్లి, తమకు పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వాలని, లేనిపక్షంలో ఈ ఫొటోలను మీ తల్లిదండ్రులకు పంపిస్తామంటూ బ్లాక్‌మెయిలింగ్‌కు దిగారు. బాధితులు తమ వద్ద అంత డబ్బు లేదని బతిమాలినప్పటికీ వినకుండా నిందితులు వారిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా, యువతి పట్ల అత్యంత అసభ్యకరంగా ప్రవర్తించి, బాధితుల వద్ద ఉన్న బంగారు ఉంగరాలు, గొలుసులను బలవంతంగా లాక్కుని అక్కడి నుండి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఉర్సుగుట్ట వద్ద దోచుకున్న బంగారు సొత్తును విక్రయించేందుకు నిందితులు వరంగల్ నగరానికి రాగా, నమ్మదగిన సమాచారంతో పోలీసులు వలపన్ని ముగ్గురిని రౌండప్ చేసి పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి దోచుకెళ్లిన బంగారు ఉంగరం, గొలుసులతో పాటు వారు నేరానికి ఉపయోగించిన మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ స్వామి తెలిపారు. నిందితులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు. పరిచయం లేని వ్యక్తులు ఫొటోలు తీస్తూ బ్లాక్‌మెయిల్ చేయాలని చూస్తే భయపడకుండా వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులను ఆశ్రయించాలని ఈ సందర్భంగా సీఐ సూచించారు.

## 'సర్' ప్రక్రియపై ఎందుకంత భయం?

(**మొదటి పేజీ తర్వాత..**) ప్రస్తుతం కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని గుర్తుచేశారు. ఒక పౌరుడికి ఓటు హక్కు ఏ ప్రాంతంలో ఉందో, అక్కడే దానిని సక్రమంగా వినియోగించుకునేలా వీలు కల్పించడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలను మోసం చేశాయని, ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతుండటంతో ప్రజలు తమను బలంగా విశ్వసిస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సదస్సులో పాల్గొన్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో ఉన్న



అక్రమాలను తొలగించి, జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడం కోసమే ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ జిల్లా స్థాయి శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఉమ్మడి మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన బీజేపీ ముఖ్య నేతలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
గురువారం, జూన్ 11, 2026

# చేతివృత్తులతోనే గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్వావలంబన

- 50 మంది వెదురు హస్తకళాకారులకు కిట్ల పంపిణీ
- అచ్చంపేటలో ఘనంగా కార్యక్రమం..
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ముందడుగు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** గ్రామీణ ప్రాంతాల్లో అంతరించిపోతున్న సాంప్రదాయ చేతివృత్తులకు జీవం పోస్తూ, కళాకారులు ఆర్థిక స్వావలంబన సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ మద్దతు అందిస్తున్నాయని తెలంగాణ హస్తకళల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ సువర్చల తెలిపారు. అచ్చంపేట పట్టణ కేంద్రంలోని శాలివాహన కుమ్మర సత్రంలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వెదురు హస్తకళాకారులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హస్తకళల డిపార్ట్‌మెంట్ ఏడీ శ్రీమతి సువర్చల, ఏపీపీసీ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ సాగర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని 50 మంది ఎంపిక చేసిన వెదురు హస్తకళాకారులకు రూ.5లక్షల విలువైన 13 రకాల అత్యాధునిక వృత్తిపరమైన పనిముట్ల కిట్లను వారు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ సువర్చల మాట్లాడుతూ.. కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ, హస్తకళల విభాగం, ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి సిద్ధంగా లభించే మట్టి, చెట్లు, రాళ్లు, లోహాలు, దారాలతో అద్భుతమైన వస్తువులు సృష్టించే కళాకారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. వారు తయారు చేసిన వస్తువులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ కల్పించి, వారిని ఆర్థికంగా ఉన్నత స్థానానికి చేర్చడమే ప్రభుత్వాల లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే గ్రామీణులకు ఉచితంగా ఆధునిక హస్తకళల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు నేడు అధునాతన పనిముట్లను అందజేశామని, వీటిని సద్వినియోగం చేసుకుని అద్భుతమైన నైపుణ్యాలు ప్రదర్శించాలని కోరారు. ఏపీపీసీ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ సాగర్ రెడ్డి మాట్లాడుతూ.. హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకోవడానికి దేశవ్యాప్తంగా ప్రభుత్వం ఉచితంగా ప్రదర్శనలు, స్టాల్స్ ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. ఈ ప్రదర్శనలకు వెళ్లే కళాకారులకు ఉచిత రవాణా ఖర్చులతో పాటు, రోజువారీ భోజన, వసతి సౌకర్యాలను ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో వీరికి మరిన్ని అత్యాధునిక శిక్షణ శిబిరాలు, నాలెడ్జ్ షేరింగ్ కోసం స్టడీ టూర్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో హస్తకళాకారులలో చైతన్యం తీసుకువస్తామని భరోసా ఇచ్చారు. గౌరవ అతిథిగా పాల్గొన్న మాతృభూమి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు రమాకాంత్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో ప్లాస్టిక్ వస్తువుల వాడకం విపరీతంగా పెరిగిపోయి పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజలు రకరకాల రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ప్రకృతి వనరులైన వెదురు, మట్టితో నిత్యజీవిత వస్తువులను తయారు చేయించడం అభినందనీయమన్నారు. కళాకారులకు అండగా నిలుస్తున్న హస్తకళల డిపార్ట్‌మెంట్, ఏపీపీసీ అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంక్షేమ పంపిణీ కార్యక్రమంలో హస్తకళల విభాగం ప్రతినిధులు, వివిధ మండలాల నుండి తరలివచ్చిన వెదురు పారిశ్రామిక హస్తకళాకారులు, కుమ్మర సంఘం నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



# జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

## లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి



**దామెర, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల పరిధిలోని ఊరుగొండ గ్రామ శివారులో జాతీయ రహదారిపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డివైడర్‌లోని మొక్కలకు నీళ్లు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుండి వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ భయంకర ప్రమాదంలో లారీ డ్రైవర్ లారీ క్యాబిన్‌లోనే నలిగిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా కిల్లా ఘనపూర్ మండలం రుక్కన్నపల్లి గ్రామానికి చెందిన నక్క బాలయ్య (40) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం ఆయన లారీతో గుడెప్పాడ్ వైపు వెళ్తుండగా, ఊరుగొండ వద్ద జాతీయ రహదారి డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలకు నీళ్లు పడుతున్న వాటర్ ట్యాంకర్‌ను లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు లారీ ముందుభాగం పూర్తిగా నలిగిపోయింది. దీంతో డ్రైవర్ నక్క బాలయ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ ముసూఫ్ కార్తీక్, క్లీనర్ గోపాల్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పరకాల రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, దామెర ఎస్సై కొంక అశోక్ తమ సిబ్బందితో కలిసి యుద్ధప్రాతిపదికన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ కావడంతో, తక్షణమే క్రేన్ సహాయంతో ధ్వంసమైన వాహనాలను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అయితే, లారీ క్యాబిన్ ముక్కల మధ్య నలిగిపోయి ఉన్న డ్రైవర్ నక్క బాలయ్య మృతదేహాన్ని బయటకు తీసేందుకు స్థానికులు ఎవరూ ముందుకు రాకపోవడంతో సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై అశోక్ స్వయంగా రంగంలోకి దిగారు. చొరవ తీసుకుని తమ చేతులతో మృతదేహాన్ని క్యాబిన్ నుంచి బయటకు తీసి, అంబులెన్స్‌లోకి ఎక్కించి మానవత్వాన్ని చాటుకున్నారు. తీవ్రంగా గాయపడిన క్లీనర్, మరో డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ ముసూఫ్ కార్తీక్ నిర్లక్ష్యంపై మృతుడి భార్య నక్క అరుణ ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొంక అశోక్ విలేకరులకు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# పరకాలలో అభివృద్ధి పనుల జోరు..

## క్షేత్రస్థాయిలో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తనిఖీ



**పరకాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పరకాల మున్సిపాలిటీ పరిధిలో సాగుతున్న పలు కీలక అభివృద్ధి పనులను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం క్షేత్రస్థాయిలో అకస్మికంగా పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయం, నిర్మాణంలో ఉన్న దామెర చెరువు కట్ట బండ్, నాలా అభివృద్ధి పనులతో పాటు అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయాన్ని ఆమె స్వయంగా సందర్శించి పురోగతిని సమీక్షించారు. ముందుగా పరకాల మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న జిల్లా కలెక్టర్‌కు మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ తదితర అధికారులు మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాలను సందర్శించిన కలెక్టర్, ప్రజలకు అందుతున్న సేవల నిర్వహణను, రికార్డులను పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కల నర్సరీని సందర్శించి పచ్చదనం పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. యువతకు సాంకేతిక నైపుణ్యాలు అందించేందుకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న 'అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్' కోసం మున్సిపాలిటీ పరిధిలో ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులపై మున్సిపల్ చైర్మన్, అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పట్టణ ప్రజలకు ఎంతో కాలంగా అవసరమైన, ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయాన్ని కలెక్టర్ సందర్శించారు. నిర్మాణ పనుల తాజా స్థితిగతులను పరిశీలించిన ఆమె.. పనుల్లో జాప్యాన్ని నివారించి, తక్షణమే వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నేరుగా ఉపయోగపడే ఇలాంటి భారీ అభివృద్ధి పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు ఉండకూడదని, నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఆరెపల్లి సుమన్, మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరిచయమే ప్రాణసంకటం

- వేములవాడలో దోపిడీ ముఠా గుట్టురట్టు!
- మహిళకు మద్యం తాగించి పుస్తెల తాడు, ఫోన్ అపహరణ..
- ఇద్దరు నిందితులు అరెస్ట్
- ప్రతిఘటిస్తే చంపేసే ప్లాన్..
- వేములవాడ 48 గంటల్లోనే కేసు ఛేదన

**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** నమ్మి వచ్చిన పరిచయస్తురాలిపై అఘాయిత్యానికి ఒడిగట్టి, బలవంతంగా మద్యం తాగించి ఆమె మెడలోని బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్‌ను దౌర్జన్యంగా దోచుకున్న ఇద్దరు కిరాతక నిందితులను వేములవాడ పట్టణ పోలీసులు అత్యంత చాకచక్యంగా అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కరిగించిన 3.6 గ్రాముల బంగారు ముద్దను, రూ. వేల విలువైన రెడ్‌మీ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వేములవాడ డివిజన్ డీఎస్పీ శ్రీనివాసులు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ సంచలన దోపిడీ కేసు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని తుకారాంగేట్ అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన వొల్లెపు జ్యోతి అనే మహిళకు కొద్ది నెలల క్రితం వేములవాడకు చెందిన ఒక వ్యక్తితో పరిచయమైంది. ఈ క్రమంలో తమ ఇంట్లో జరిగే పట్నం దైవ కార్యక్రమానికి రావాలని సదరు వ్యక్తి ఆహ్వానించడంతో, అతని మాటలు నమ్మిన జ్యోతి ఈ నెల 6న వేములవాడకు చేరుకుంది. రాత్రి సమయంలో ఆమె నందికమాన్ జంక్షన్ వద్ద వేచి ఉండగా.. నిందితులు ఇద్దరు ప్లాన్ ప్రకారం ఆటోలో వచ్చి, ఆమెను నమ్మించి సమీపంలోని ఒక నిర్మానుష్య కొండ ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ జ్యోతిపై దౌర్జన్యం చేసి, బలవంతంగా మద్యం తాగించారు. ఆమె స్పృహ కోల్పోయే స్థితికి రాగానే మెడలోని బంగారు పుస్తెలు, గుండ్లు, రూ.వేల విలువైన మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కొని చీకట్లో పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీసులు క్రైమ్ నెం. 305/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పట్టణ పోలీసులు సాంకేతిక ఆధారాలు, క్షేత్రస్థాయి విచారణ ఆధారంగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం వేములవాడ ఎస్ఆర్ఆర్ జాతర మైదానం పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న బొడసు అశోక్ (ఏ1), దండుగుల ప్రవీణ్ (ఏ2) లను పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. దీంతో తామే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. దోపిడీ సమయంలో ఒకవేళ బాధితురాలు గట్టిగా కేకలు వేస్తూ ప్రతిఘటించి ఉంటే.. ఆమె గొంతు నులిమి అక్కడికక్కడే హత్య చేయాలనే ముందస్తు స్కెచ్‌తోనే నిందితులు ఈ ఘోరానికి ఒడిగట్టినట్లు తేలింది. దోచుకున్న పుస్తెల తాడును అప్పటికే కరిగించి మార్కెట్లో అమ్మేందుకు బంగారు గడ్డగా మార్చగా, పోలీసులు దాన్ని సకాలంలో రికవరీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మార్గదర్శకత్వంలో, వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో కేసును అత్యంత వేగంగా ఛేదించిన సబ్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్, పీసీలు గోపాల్, ఇమ్రాన్‌లను డీఎస్పీ శ్రీనివాసులు శాలువా కప్పి ప్రత్యేకంగా అభినందించారు. పోలీసుల నిబద్ధత, నిరంతర నిఘా వల్లే నిందితులను 48 గంటల వ్యవధిలోనే పట్టుకోగలిగామని ఆయన ప్రశంసించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
గురువారం, జూన్ 11, 2026

# ఫర్టిలైజర్స్ దుకాణాలపై అధికారులతనిఖీలు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- డీలర్లకు అధికారుల హెచ్చరిక
- అచ్చంపేటలో టాస్క్‌ఫోర్స్ తనిఖీ..



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అచ్చంపేట పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలపై అధికారులు నిఘా తీవ్రం చేశారు. గురువారం పట్టణ కేంద్రంలోని 'శ్రీనివాస ట్రేడర్స్' విత్తన, ఎరువుల దుకాణంలో రెవెన్యూ, వ్యవసాయ, పోలీసు శాఖల అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణంలోని స్టాక్ రిజిస్టర్లు, నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు దుకాణ యాజమాన్యానికి చట్టపరమైన నిబంధనలపై పలు కీలక సూచనలు చేశారు. డీలర్లు తమ దుకాణాల ఎదుట తప్పనిసరిగా స్టాక్ బోర్డును ఏర్పాటు చేయాలని, అందులో రోజువారీ నిల్వల వివరాలను, ధరలను ఎప్పటికప్పుడు నవీకరించాలని స్పష్టం చేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు విక్రయించిన ప్రతిసారీ ఖచ్చితంగా కంప్యూటర్ లేదా నగదు బిల్లులను ఇవ్వాలని, ఆ బిల్లులపై సదరు రైతు సంతకం, ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పీ ధరల కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా, రైతులను తప్పుదోవ పట్టించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అదేవిధంగా, గడువు ముగిసిన విత్తనాలు, ఎరువులను విక్రయించి రైతులను నష్టపరిస్తే సహించేది లేదన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వ్యాపారులు వ్యాపార లాభాల కంటే రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సంయుక్త తనిఖీల్లో అచ్చంపేట మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య, అచ్చంపేట సబ్ ఇన్‌స్పెక్టర్ సద్దాం హుస్సేన్‌తో పాటు రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపీ మల్లు రవిని సన్మానించిన కర్ణాటక మరాఠా నేతలు



**బెంగళూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కర్ణాటకలో పార్లమెంటరీ కమిటీ పర్యటనలో భాగంగా నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి బెంగళూరులోని వసంత్ నగర్ లో ఉన్న మరాఠా భవన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా కర్ణాటక మరాఠా సంఘం అధ్యక్షుడు ఎంపీ సురేశ్ రావు సాఠే, ఎంపీ మల్లు రవిని సత్కరించారు. కర్ణాటకలో 38 లక్షల మంది మరాఠాలున్నారని, తాము కూడా వారి సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్, కర్ణాటక మరాఠా సంఘం చైర్మన్ ఎస్.ఆర్.సింధియా, ఉపాధ్యక్షులు నాగేశ్ రావు, కోశాధికారి వెంకట్ రావు చౌహాన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వినోద్ రావు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఉమాబాయి మానె, యూత్ కాంగ్రెస్ నాయకులు బాలగోని అరుణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓపెన్ జిమ్ పరికరాల మరమ్మతు పనులు వేగవంతం

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన మున్సిపల్ చైర్మన్
- త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** వేములవాడ పట్టణ ప్రజల శారీరక దృఢత్వం, ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పునరుద్ధరణకు మున్సిపల్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ మేరకు గురువారం మున్సిపల్ ఆవరణలోని ఓపెన్ జిమ్ వ్యాయామ పరికరాల మరమ్మతు పనులను మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక వార్డు కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్‌తో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు, యువతీయువకులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ ఉన్న వ్యాయామ పరికరాలను పెద్ద ఎత్తున వినియోగిస్తుంటారని తెలిపారు. గత కొంతకాలంగా పాడైపోయిన, తుప్పుపట్టిన పరికరాల వల్ల వినియోగదారులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, పూర్తి స్థాయి భద్రతా ప్రమాణాలను పాటిస్తూ నాణ్యమైన మరమ్మతులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్లను, సిబ్బందిని ఆదేశించారు. పట్టణ కేంద్రంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఓపెన్ జిమ్ పరికరాల రిపేర్ పనులను సకాలంలో ముగించాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే మళ్లీ యువతకు, వృద్ధులకు మరియు పట్టణ వాసులకు ఈ ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తెస్తామని, ప్రతి ఒక్కరూ ఈ ఉచిత వసతిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయడంలో ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్షేత్రస్థాయి తనిఖీ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్యదర్శికి ఘన వీడ్కోలు

- ఘనంగా సన్మానించిన గ్రామస్థులు



**లింగాల, వాయిస్ ఆఫ్ వందే భారత్:** మండలంలోని అప్పాయిపల్లి గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా సుదీర్ఘకాలం పాటు విశిష్ట సేవలందించిన సభావట్ వెంకటేష్ బదిలీ అయ్యారు. ప్రభుత్వ జనరల్ బదిలీలలో భాగంగా ఆయన అచ్చంపేట మండలంలోని ఐనోల్ గ్రామపంచాయతీకి బదిలీ కావడంతో అప్పాయిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం రాత్రి ఆయనకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు కలిసి అత్యంత ఆత్మీయంగా ఘన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ విజయ మాట్లాడుతూ.. సభావట్ వెంకటేష్ అప్పాయిపల్లి పంచాయతీ కార్యదర్శిగా ఉన్న కాలంలో గ్రామాభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, హరితహారం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేర్చడంలో అత్యంత అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. నిరంతరం గ్రామ ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో తన విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామానికి విశేష సేవలు అందించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయ గారు, ఉప సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు కలిసి బదిలీపై వెళ్తున్న కార్యదర్శి సభావట్ వెంకటేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ మహిళా సంఘాల సభ్యులు,అప్పాయిపల్లి గ్రామ ప్రజలు పాల్గొని కార్యదర్శికి శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులవడ్లను వెంటనే కొనుగోలు చేయాలి

- సీపీఎం జిల్లా నేత దేశా నాయక్
- తడిసిపోతే ఆరుగాలం కష్టం వృథా..
- రైతుల అకౌంట్లలో వెంటనే డబ్బులు జమ చేయాలి



**బల్మూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్:** బల్మూరు మండలంలోని కొండనాగుల గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేశా నాయక్, మండల కార్యదర్శి శంకర్ నాయక్, జిల్లా నాయకులు సైదులు గురువారం సందర్శించారు. కేంద్రంలో ఉన్న ధాన్యం నిల్వలను, కొనుగోళ్ల తీరును వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నేత దేశా నాయక్ మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన వరి ధాన్యానికి ఎలాంటి కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వం వెంటనే కాంటాలు పెట్టి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రోహిణి కార్తె ముగిసి మృగశిర కార్తె ప్రవేశించడంతో వానాకాలం సీజన్ ప్రారంభమైందని, ఎప్పుడు వర్షాలు పడినా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం అంతా తడిసిపోయి ముద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. వర్షాల వల్ల ధాన్యం దెబ్బతింటే ఆరుగాలం శ్రమించిన రైతాంగానికి కష్టార్జితం దక్కకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే వానాకాలం పంట సాగుకు పెట్టుబడులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన బకాయి సొమ్మును నిబంధనల సాకులు చెప్పకుండా తక్షణమే నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని అధికారులను కోరారు. ధాన్యం కొనుగోళ్ల ఆలస్యంపై అక్కడే ఉన్న పీఏసీఎస్ చైర్మన్ నరసయ్య యాదవ్‌ను సీపీఎం నేతలు వివరణ అడగగా.. కొండనాగుల కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన కొనుగోళ్లు జరుపుతున్నామని తెలిపారు. రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు క్వింటాళ్ల వారీగా ఆన్‌లైన్ విధానంలో నమోదు చేస్తున్నామని, ప్రభుత్వం నేరుగా వారి అకౌంట్లలోనే నిధులను జమ చేస్తుందని చైర్మన్ వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శంకర్ నాయక్, జిల్లా నాయకులు వర్ధన్, సైదులుతో పాటు కొండనాగుల గ్రామానికి చెందిన పలువురు రైతులు, కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.